క్లుప్తంగా

నేడు అభినందన సభ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభినందన సభ మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బి.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, సత్కరించనున్నామన్నారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కూడా హాజరవుతారన్నారు.

వాహన తనిఖీలు



కారు డిక్కీలో సోదాలు చేస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ పి.నారాయణరావు తన సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనాలను ఆపి, వాహన ధ్రువపత్రాలు, వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలు ఏవైనా రవాణా చేస్తున్నారా అని కూడా సోదాలు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్తున్న వాహనదారులకు, వాహన ధ్రువపత్రాలు సరిగా లేని వారికి అపరాధ రుసుం విధించారు. వాహనదారులంతా తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

మౌనం వీడాలి



బుక్కూరులో బాలికలతో మాట్లాడుతున్న వైద్యురాలు వెన్నెల

పాలకొండ రూరల్: కిశోర బాలికలకు మౌనం వీడి తమలో వచ్చిన మార్పులను తల్లులకు వివరించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వెన్నెల తెలిపారు. బుక్కూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం పేరుతో బాలికలతో సోమవారం మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శారీరకంగా, ఆరోగ్యపరంగా వచ్చే మార్పులను తల్లులు, అక్కలు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం పెరుగుదలకు అవసరమైన జాగ్రత్తలను వివరించారు. ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్త, బాలికలు పాల్గొన్నారు.

పరామర్శ

భామిని: మండలంలోని బత్తిలికి చెందిన టింగ చిన్నపల్లమ్మ (78) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మృతురాలి కుటుంబ సభ్యులు టింగ అన్నాజీ, శాంతికుమారిలను సోమవారం పరామర్శించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంటల మార్పిడితో భూసారం వృద్ధి..

- వేర్వేరు పంటలతో అధిక ప్రయోజనాలు
- వ్యవసాయాధికారులు



ఖరీఫ్‌లో పంటలు వేసేందుకు దుక్కులు పూర్తి చేసిన భూములు

పాలకొండ రూరల్: నిర్దేశిత పొలంలో ఒకే పంటను ఏటా సాగు చేయడం ద్వారా దిగుబడులపై తీవ్ర ప్రభావం ఉంటుంది. పంటల్లో ఎదుగుదల క్షీణిస్తుంది. చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుంది. దీనిని అధిగమించేందుకు పంటల మార్పిడి విధానం పాటించటం ద్వారా భూమిలో అంతర్గత సారం పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒకే పొలంలో వేర్వేరు పంటలను క్రమ పద్ధతిలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలను వ్యవసాయశాఖ అధికారులు రైతులకు వివరిస్తున్నారు. పంట మార్పిడితో ప్రకృతి వనరులు సమర్థవంతంగా వాడుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అత్యధిక లాభం పొందే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రబీ నుంచి రానున్న ఖరీఫ్ సీజన్‌కు అన్నదాతలు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడి ఆవశ్యకతపై రైతులకు ప్రయోజనకరమైన సూచనలను అధికారులు వివరిస్తున్నారు.

ఒకే పంట సాగుతో కలిగే నష్టాలు..

- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల ఆ లోతు వరకు ఉన్న పోషకాలు మాత్రమే పంట వినియోగించుకుంటుంది.
- ఏటా ఒకే పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద అధికంగా ఉంటుంది. పైరు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందదు. దిగుబడులు ఏటా తగ్గుతాయి. రైతుపై పెట్టుబడి భారం పెరుగుతుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంటలో నాణ్యత లోపిస్తుంది. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంటుంది. మార్కెటింగ్ సమస్యలు ఎదురవుతాయి.

నియోజకవర్గంలో సాగు వివరాలు.. రైతులు

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు
పాలకొండ	6,345	12,901
వీరఘట్టం	7,112	14,201
సీతంపేట	3,079	9,173
భామిని	3,778	7,549

అనుసరించాల్సిన మెలకువలు..

- ఎక్కువ లోతు వేర్లు ఉన్న పైర్లు, తక్కువ లోతు గల పైర్లు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. వరి–అపరాలు, జొన్న–పత్తి వంటి పంటలు వరుసగా వేయడం మంచిది.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవడం మేలు. ఉదాహరణకు మొక్కజొన్న –అపరాలు పండించటం వంటివి.

పంట మార్పిడితో లాభాలు..

పంట మార్పిడి విధానం ద్వారా అనేక లాభాలు ఉన్నాయి. వీటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరిపంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండడం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది. వరి తర్వాత అపరాలు, వేరుశనగ, సోయా చిక్కుడు తదితర పంటలు సాగు చేయడం వలన భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాల ఉధృతి తగ్గుతుంది. వరి తర్వాత చిక్కుడు జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ సాగు వల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటాయి. వేర్లలో బుడుపులు మాదిరి ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

పంట మార్పిడితో మంచి దిగుబడులు..



రైతులు ఏటా ఒకే పంటను క్రమం తప్పకుండా సాగు చేస్తున్నారు. నీటి పారుదల కింద అధికంగా వరి పంట తప్ప వేరే పంట సాగు చేసేందుకు మొగ్గు చూపడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనిని అధిగమించేందుకు పంట మార్పిడి విధానం చాలా శ్రేష్ఠమైంది. రైతులు అవగాహన పెంచుకోవాల్సి ఉంది. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను ఒకసారి అనుభవంలోకి వస్తే ఆ విధానమే రైతులు కొనసాగిస్తారు. దీనిపై క్షేత్రస్థాయిలో మా సిబ్బందికి విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. – రత్నకుమారి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు



సీతంపేట: నవధాన్యాలు



భామిని: నవధాన్యాల ప్రదర్శన

సీతంపేట: నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ పాలకొండ డివిజన్ ఏడీఏ రత్నకుమారి అన్నారు. మండలంలోని దోనుబాయి రైతుసేవా కేంద్రంలో నవధాన్యాల కిట్ల తయారీ, పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నవధాన్యాలను ప్రతి రైతూ పొలంలో చల్లాలని సూచించారు. ఎటువంటి రసాయనాలు, పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదని చెప్పారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎ.వరలక్ష్మి, రోజారమణి, ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జ్ బాలు, మండల ఇన్‌చార్జ్ సత్యనారాయణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెంపు...

భామిని: నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం, ప్రకృతి సాగు ఎం.టీ మోటక అంబోజీ అన్నారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ప్రకృతిసాగులో భాగంగా నవధాన్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తొలకరి వర్షాలు పడిన వెంటనే నవధాన్యాలను సాగు చేయాలన్నారు. మొలకలు వచ్చిన తర్వాత కలియదున్నితే భూమి సారవంతమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు అలికాన ఎర్రన్న, ప్రకృతి సాగు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘ నాయకులు

పాలకొండ: తోటపల్లి ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టు రైతుల కోసం చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘ నాయకుడు బంటు దాసు పిలుపునిచ్చారు. మండలంలోని సింగన్నవలసలో రైతు సంఘ నాయకులు సోమవారం పర్యటించి, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోటపల్లి ఆయకట్టు రైతులకు ప్రతి ఏటా సాగునీరు అందడం లేదని వివరించారు. ఈ సమస్యను పలుమార్లు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కలుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందాలంటే అత్యవసరంగా కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఆయకట్టు రైతులందరూ ధర్నాలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు, దావాల రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

● వేసవి దుక్కు..లాభాలు దక్కు!



ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పంట దిగుబడి కావాలంటే మొదట నేలను సారవంతం చేసుకోవడం ముఖ్యం. ఈ నేపథ్యంలో దుక్కి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అధిక భూసారానికి పొలాల్లో నవధాన్యాలు జల్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ, పుట్టజమ్ము, చెముడుగూడ, అడ్డంగూడ, కేదారిపురం, దుడ్డుఖల్లు, రేగిడి, కొండుకుప్ప, రాయగడజమ్ము, బీరుపాడు తదితర గిరిజన గ్రామాల్లో వేసవి దుక్కులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గుమ్మలక్ష్మీపురంలో ట్రాక్టరుతో దుక్కి చేస్తున్న దృశ్యం ఈ చిత్రంలో చూడొచ్చు.

–గుమ్మలక్ష్మీపురం

● ఐక్యతతోనే హక్కుల సాధన



ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమని సీపీఎం నాయకులు ఎస్.చంద్ర, పి.పోలీసు, బి.నర్సింగరావు పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా గరుగుబిల్లి మండల కేంద్రంలో ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న భూములపై ఆదివాసీలకు హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇవ్వాలని సోమవారం ర్యాలీ నిర్వహించారు. 1/70 చట్టాన్ని పటిష్టం చేసి ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని కోరారు.

–గరుగుబిల్లి

● ఉపాధ్యాయుల ధర్నా..



ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విద్యను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని యూనియన్ నాయకులు శాసపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ ఆరోపించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ బాలమురళీకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్.ధనుంజయరావు, గణేష్, బీవీ రమణ, టి. ఉమామహేశ్వరరావు, ఎ. నాగరాజు, జి. రామోహ్మనరావు, రమేష్, చంటిబాబు, ఎస్వీ రమణ. తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ

పరిశీలన ..



పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌ను ఐటీడీఏ ఏపీఓ చినబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ నెల 19వ తేదీ నుంచి జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు చంద్రరావు, వసంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

– సీతంపేట

బాధ్యతల స్వీకరణ

పాలకొండ: నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా ఆకుల మల్లీశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆమెను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కార్యక్రమంలో పాల్గొని చైర్‌పర్సన్‌ను అభినందించారు.

విస్తృత తనిఖీలు



లాడ్జీల్లో బస చేస్తున్న వ్యక్తుల వేలి ముద్రలు సేకరిస్తున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాలకొండలో స్థానిక పోలీసులు సోమవారం రాత్రి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్సై కె.ప్రయోగమూర్తి నేతృత్వంలో సిబ్బంది ఏక కాలంలో స్థానిక లాడ్జీలు, అన్ని రకాల వాహనాలు, ఆర్టీసీ కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తుల కదలికలు, అనుమానితుల నుంచి ఎంఎస్‌సీడీ డివైజ్ పరికరంతో వేలి ముద్రలు సేకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట, కొత్తూరు మండలం కారిగూడలలో ఉన్న మినీ గురుకులాల్లో ప్రవేశాలకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 30 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే రెండో తరగతి నుంచి ఏడు వరకు ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేస్తామని, ఆసక్తి గలవారు ఈన ఎల 26వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. వచ్చే నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో లాటరీ ద్వారా ఎంపిక కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ రూరల్:



పాలకొండ ఆర్టీసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ సర్వీసుల పేరిట తొలగించిన బస్సులను తిరిగి తిప్పాలని సూచించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌ల డబ్బులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు వై.నీలయ్య, ఎం.ఆర్ మూర్తి, ఎంవీ నాయుడు, డీఆర్ రావు తదితరులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి



చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ తమ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో చేతుల పరిశుభ్రతపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మన పరిసరాల్లోని కంటికి కనిపించని ఎన్నో వ్యాధికారక సూక్ష్మజీవులు ఉంటాయని, అవి మన చేతులపై ఉండకుండా చూసుకోవాలన్నారు. చేతులు శుభ్రంగా లేకపోతే మనం తినే ఆహారం ద్వారా ఆ సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి, వ్యాధులు కలుగజేస్తాయన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు శంకుస్థాపన

సీతంపేట: స్థానిక కేజీబీవీలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలకు సంబంధించి అదనపు భవనాల నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే ఎస్.జయకృష్ణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 2.12 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బి.సంధ్యారాణి, ఐటీడీపీ కో ఆర్డినేటర్ ఇమరక పవన్, కూటమి నాయకులు ముఖలింగం, ఎం.విశ్వనాథం, హెచ్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంచలంచెలుగా అభివృద్ధి

భామిని: నియోజకవర్గాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. స్థానిక కేజీబీవీలో రూ. 2.55 కోట్లతో నిర్మించనున్న అదనపు భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జగదీశ్వరరావు, బిడ్డిక ప్రసాద్, కోరాడ రాజేష్, లోపింటి రాజేష్, కాంట్రాక్టర్ పాగిరి అర్జున, బత్తిలి పురోహితులు రంపా లలిత ప్రసాద్ శర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల విధులపై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలి



గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీవో సాల్మన్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



ఎంపీడీవో ఉమామహేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గుమ్మలక్ష్మీపురం:

పంచాయతీ కార్యదర్శులు సచివాలయంలో నిర్వహించాల్సిన విధులపై స్పష్టమైన ఉత్తర్వులు రాతపూర్వకంగా ఇవ్వాలని కోరుతూ మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులంతా ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజును మండల కేంద్రంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 2వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా జేసీ.. జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయాలకు హెడ్‌గా ప్రభుత్వం గుర్తించలేదని, పంచాయతీ కార్యదర్శులు కూడా సచివాలయ సిబ్బందితో సమానమేనని, ఎటువంటి పర్యావేక్షణ అధికారాలు లేవని, సచివాలయంలో ఎవరికో ఒకరికి బాధ్యతలు ఇవ్వాలి కాబట్టి డీడీవోగా బాధ్యతలు ఇచ్చారన్నారు. అలాగే జీతాలు పెట్టడం వరకే కార్యదర్శుల బాధ్యత అని, సచివాలయ సిబ్బంది గ్రామ సచివాలయం పరిధి దాటి వెళ్లినను పంచాయతీ కార్యదర్శులు అడగడానికి అధికారం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు తమ విధులపై స్పష్టతనివ్వాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు.

వినతిపత్రం అందజేత

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): జేసీ(జాయింట్ కలెక్టర్) చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరుతూ కురుపాం మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులంతా ఎంపీడీవో జె.ఉమామహేశ్వరిని కురుపాంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.



భామిని: ఎంపీడీఓ సత్యంనకు వినతిపత్రం ఇస్తున్న మండల కార్యదర్శులు



పాలకొండ రూరల్: ఎంపీడీఓ విజయరంగారావుకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల విధులపై స్పష్టమైన వివరణ వచ్చే వరకు తమకు కేటాయించిన క్లస్టర్లలో మాత్రమే సర్వేలు చేస్తూ వాటికి మాత్రమే బాధ్యత వహిస్తామని వారు స్పష్టం చేశారు.

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.పైడితల్లిని పంచాయతీ కార్యదర్శులంతా కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాల్సిన విధులను తెలియజేస్తూ రాతపూర్వకమైన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీహెచ్ కురిమినాయుడు, బి.సాయికుమార్, బి.అప్పారావు, ఎస్. రవికుమార్, తదితరులు ఉన్నారు.

బాధ్యతలు తెలియజేయండి..

భామిని: పంచాయతీ కార్యదర్శులకు కల్పించిన విధులు, బాధ్యతలు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కొండపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 2వ తేదీన జేసీ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని.. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై కార్యదర్శులకు ఉన్న అధికారాలను తెలియజేయాలని కోరారు.

కార్యదర్శుల ఆవేదన..

పాలకొండ రూరల్: ఇటీవల జేసీ శోభిక పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తమను బాధించాయని కార్యదర్శుల సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ విజయరంగారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ద్వారా జిల్లా గ్రామ పంచాయతీ అధికారికి, పంచాయతీ కార్యదర్శులకు సచివాలయాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత ఇవ్వాలన్నారు. తమ విధుల పట్ల చేసిన వ్యాఖ్యల రిత్యా ఉన్నతాధికారులు ఈ విషయమై స్పష్టత ఇచ్చే వరకూ తమకు కేటాయించిన పంచాయతీ విధులు, సచివాలయ పరిధిలో కేటాయించిన క్లస్టర్‌కు సంబంధించిన విధులు మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

'మనమిత్ర'తో సమస్యల పరిష్కారం

వీరఘట్టం: వాట్సాప్‌లో హాయ్ అని నమోదు చేసిన వెంటనే మనమిత్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సేవలు పొందవచ్చని ఎంపీడీఓ బి. వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'మన మిత్ర – ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు' కార్యక్రమంలో భాగంగా మన మిత్ర యాప్ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 250 రకాల ప్రభుత్వ సేవలను ఈ యాప్ ద్వారా అర్జీదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. వీటిని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ డి.వెంకటరమణ, ఈఓపీఆర్‌డీ పి.వెంకటరమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం: ఇళ్లు, ఇళ్లస్థలాలు కావాల్సిన నిరుపేదలంతా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు ఎస్.శేఖర్ ఓ ప్రకటనలో సోమవారం కోరారు. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల లోపు ఉండి, కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటని వారు అర్హులన్నారు. అలాగే రైస్‌కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల్లో ఎవరూ ఇదివరకు ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు గానీ ఇంటిస్థలం గానీ పొంది ఉండకూడదన్నారు.